కనకదుర్గాదేవి ఆలయం ముస్తాబు



ముస్తాబైన కనకదుర్గాదేవి ఆలయం, కొలువైన అమ్మవారు

రెబ్బెన, అక్టోబర్ 2 : ఇందిరానగర్ గ్రామంలో ఇద్దరు అమ్మలు కొలువు దీరిన శ్రీ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళీ దేవస్థానంలో గురువారం నుంచి దేవీ నవరాత్రులు అంగరంగ వైభవంగా ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రెండో చంద్రపూర్‌గా ప్రాచుర్యం పొందిన ఈ దేవస్థానంలో 12వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్‌స్వామి, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజులు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు. నిత్యం హోమం, అన్నదానం ఉంటుందని, విజయదశమి రోజున అమ్మవారి ఊరేగింపు, వాహన పూజలు ఉంటాయని తెలిపారు.

చెరువును తలపిస్తున్న జీజీహెచ్

ప్రభుత్వ దవాఖాన డయాలసిస్ సెంటర్ వద్ద నిలిచిన నీరు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 2 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం గంటపాటు కురిసిన వర్షానికి ప్రభుత్వ దవాఖాన ఆవరణ చెరువును తలపిస్తున్నది. డయాలసీస్ కేంద్రానికి వెళ్లే మార్గంలో భారీగా నీరు వచ్చి చేరడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2 నుంచి 3 గంటల పాటు అవస్థ పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతోనే నీరు నిలిచిందని పలువురు అంటున్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

చెన్నూర్ రూరల్ / భీమారం, అక్టోబర్ 2: వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ అన్నారు. చెన్నూర్ మండలంలో కిష్టంపేట అర్బన్ పార్కులో వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలను అటవీ శాఖ బటర్‌ఫ్లై స్పెషలిస్ట్ ప్రొఫెసర్ రంజాన్ విరంజి, మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్వోలతో కలిసి డీఎఫ్‌వో ప్రారంభించారు. అటవీ ప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం భీమారంలోని గొల్లవాగును సందర్శించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్ పేట్, అక్టోబర్ 2 : అక్రమంగా తరలిస్తున్న పశువులను బుధవారం ఉదయం తెల్లవారు జామున మండలంలోని లోడ్పల్లి గ్రామ శివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా 4 కంటైనర్ లారీల్లో పశువులను మహారాష్ట్ర గడ్చిరోలి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. షఫీ, కృష్ణ, సోహేద్, నదీమ్ షేక్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో ఇద్దరు పరారయ్యారని తెలిపారు. 128 పశువులను కోసిని రాధాగోపాలకృష్ణ గోశాలకు అప్పగించినట్లు తెలిపారు. లారీల్లో కిక్కిరిసి నింపడంతో 21 పశువులు మృతిచెందినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శ్రీరాంపూర్, అక్టోబర్ 2 : శ్రీరాంపూర్ ఏరియా సుభాష్‌నగర్‌లో నివసించే కొప్పు సుగుణ బుధవారం సాయంత్రం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే భర్త శంకరయ్య మంచిర్యాల దవాఖానకు తరలించడంతో ప్రాణపాయం లేదని వైద్యులు తెలిపారు. కొప్పు సుగుణ తన ఇంటి ప్రహరీ కట్టుకోగా స్థానికుల అవసరాల కోసం నిర్ణయించిన స్థలంలో అక్రమంగా నిర్మించారని మున్సిపాలిటీ అధికారులు కొన్ని నెలల క్రితం తొలగించారు. దీనిపై కొప్పు సుగుణ హైకోర్టులో పిటీషన్ వేశారు. పిటీషన్‌కు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డును సుగుణ ఆ స్థలంలో ఏర్పాటు చేశారు. బుధవారం మహిళలు బతుకమ్మ ఆడుకోవడానికి బోర్డు అడ్డుగా ఉందని మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ అధికారులకు బోర్డు పెట్టే హక్కు ఎవరికీ లేదని తెలుపుతూ తొలగించారు. మనస్తాపంతో కొప్పు సుగుణ నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది.

ఖైదీల సంక్షేమ దినోత్సవం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 2 : ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో జైలర్ ప్రేమ్ కుమార్ అధ్యక్షతన ఖైదీల సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. జిల్లా జడ్జి ఎం వీ రమేశ్, సీనియర్ సివిల్ జడ్జి యువరాజుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఖైదీలతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సివిల్ జడ్జి యువరాజు, మున్సిపల్ కమిషనర్ భుజంగరావుతో కలిసి జడ్జి ఎంవీ రమేశ్ స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కోర్టు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే చిల్డ్రన్స్ పార్కులో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీవో, మున్సిపల్ ప్రత్యేకాధికారి లోకేశ్వర్‌రావు పాల్గొని, పరిసరాలు శుభ్రం చేశారు. సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా రాజేశ్

బెల్లంపల్లి, అక్టోబర్ 2 : దళిత సంఘాల ఐక్యవేదిక పట్టణాధ్యక్షుడిగా కుంభాల రాజేశ్ నియామకమయ్యారు. బుధవారం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా రిటైర్డ్ డీఎస్పీ పులాల రవికుమార్, గౌరవ సలహాదారులుగా మల్లారపు చిన్నరాజం, భూక్యా రాము నాయక్, గౌరవాధ్యక్షుడిగా సముద్రాల మురళి, ప్రధాన కార్యదర్శిగా రత్నం ఐలయ్య, కోశాధికారిగా గొడిసెల శ్రీహరి, కార్యదర్శులుగా దుబాసి రవి, రంగ ప్రశాంత్, దుర్గం చక్రవర్తి, డోలే సురేశ్, ఉపాధ్యక్షులుగా కుశ్నపల్లి రాజలింగు, గొడిసెల చంద్రమౌళి, సలహా కమిటీ సభ్యులుగా దుర్గం గోపాల్, ఉంద్రాల్ల మల్లయ్య, డీఆర్ శ్రీధర్, బండి ప్రసాద్, కమ్మరి భీమయ్య, ప్రచార కార్యదర్శులుగా పైడిమల్ల చంద్రశేఖర్, కాంపెల్లి సతీశ్, జంజర్ల రవిరాజ్, కార్యవర్గ సభ్యులుగా ఉంద్రాల రవి, బొల్లి వంశీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇసుక లారీల పట్టివేత

బెల్లంపల్లి, అక్టోబర్ 2 : అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను బుధవారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు కోటపల్లి మండలం నుంచి బెల్లంపల్లికి తరలిస్తున్న లారీలను కాల్‌టెక్స్ సమీపంలో మైనింగ్ అధికారులు సురేశ్, రామ్ నరేశ్ పట్టుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీసుల పల్లె నిద్ర

వేమనపల్లి, అక్టోబర్ 2 : మండలంలోని కేతనపల్లిలో బుధవారం రాత్రి నీల్వాయి పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ శ్యాంపటేల్ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మందమర్రి : మేదరిబస్తీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

- రంగు రంగుల పూలతో అలంకరణ.. • ఆడిపాడిన యువతులు, మహిళలు

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 2 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి.. ఒక్కచోట చేరారు. ఒక్కేసి పువ్వేసి చందమామ.. అంటూ పాటలు పాడుతూ సందడి చేశారు. మహిళలు, యువతులు చప్పట్లు, కోలాటాలతో ఘనంగా ఆడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. శ్రీరాంపూర్ కాలనీ వాటర్ ట్యాంక్ కాలనీలో నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్ వేడుకలను ప్రారంభించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో యంగ్ ఉమెన్స్ జిల్లా కన్వీనర్ చాపిడి శ్రావణి ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.

తాండూర్ : బోయపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టికనంద్, గోడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, యంగ్ ఉమెన్ జిల్లా కో కన్వీనర్స్ కే మంజుల, చిట్టి, అక్షయ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చటరీ భీంరావ్, డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్ కుమార్, వడ్లూరి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, కమిటీ సభ్యులు జాడి తిరుపతి, నాయకులు తిరుపతి, మనోహర్ రాజు, పూజ, విద్యార్థులు పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలోని మార్కెట్‌తో పాటు, పాలచెట్టు ఏరియా, పాతబస్టాండ్ ఏరియాల్లో బతుకమ్మ పూలదుకాణాలు వెలిశాయి. సీసీసీ నస్పూర్‌లో భారీ వర్షం కురవగా, బతుకమ్మ వేడుకలు జరుపుకునే అవకాశం ఉండదని మహిళలు కొంత ఆందోళనకు గురయ్యారు. సాయంత్రానికి తగ్గుముఖం పట్టడంతో సంతోషం వ్యక్తం చేస్తూ వేడుకల్లో నిమగ్నమైయ్యారు. 7 గంటల నుంచి వేడుకలు ప్రారంభమయ్యాయి. సీసీసీ నస్పూర్ ఎస్ఐ సుగుణాకర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే హాజీపూర్, చెన్నూర్, దండేపల్లి, రెబ్బెన, నెన్నెల, కన్నెపల్లి, దహెగాం మండలాల్లో, తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో మహిళలు ఘనంగా బతుకమ్మ ఆడారు.

దండేపల్లిలో..

సీసీసీ నస్పూర్‌లో..

హాజీపూర్ : ముల్కల్లలో..

పైలెట్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 2 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు జారీ పైలెట్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సర్వే బృందాల ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలో గల 10వ వార్డు.., కెరమెరి మండలంలోని ధనోర.., సిర్పూర్ నియోజకవర్గంలోని కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు.., సిర్పూర్(టీ) మండలంలోని వెంకట్రావుపేట గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. 3 నుంచి 7వ తేదీ వరకు సర్వే పూర్తిచేయాలని,

ఆసిఫాబాద్ టౌన్ : మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అనంతరం సర్వే విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా వెంకట్రావ్‌పేట్..

సిర్పూర్(టీ), అక్టోబర్ 2 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవోలు రెండు బృందాలుగా సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్‌లో..

నస్పూర్, అక్టోబర్ 2 : మంచిర్యాల కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, జడ్పీసీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి అధికారులతో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ పైలెట్ సర్వేపై మంచిర్యాల ఆర్డీవో రాములు సమావేశం నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్టు కోసం మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లి మండలం అల్లీపూర్.., మంచిర్యాల మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు అశోక్‌నగర్.., బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట మండలం లంబాడితండా(కే).., బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు టేకులబస్తీ.., చెన్నూర్ నియోజకవర్గంలోని చెన్నూర్ మండలం సంకారం.., మున్సిపాలిటీలోని 5 వార్డులను ఎంపిక చేసినట్లు చెప్పారు. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్ నియోజకవర్గాలకు ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, జడ్పీసీఈవో గణపతి నోడల్ అధికారులుగా నియమించినట్లు చెప్పారు. 3 నుంచి 5 రోజుల పాటు సర్వే పూర్తి చేయాలని, 9న వివరాలను పరిశీలించి నిర్ణీత ప్రొఫార్మాలో పొందుపర్చి 10న కలెక్టర్‌కు నివేదిక అందించాలని పేర్కొన్నారు.

స్వచ్ఛంద మద్యపాన నియంత్రణ అభినందనీయం

ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

దండేపల్లి, అక్టోబర్2: రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా దండేపల్లి మండలం నుంచి స్వచ్ఛంద మద్యపాన నియంత్రణ కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని దండేపల్లిలోని గాంధీజీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రీ చిత్రపటాలకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీపీ భాస్కర్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో రూ.25 లక్షలతో ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్, రూ.1.15 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ కోట్నాక తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్, తహసీల్దార్ సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు.

తాగుడు మానేస్తేనే పదవులు : ఎమ్మెల్యే

మద్యం తాగుడు మానేసిన వారికే నామినేటెడ్, స్థానిక సంస్థల పదవులు వస్తాయని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఆసక్తికర ప్రకటన చేశారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలతో మద్యం తాగబోమని ప్రమాణం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రమాణం చేసిన వారిలో ఎవరైనా మద్యం తాగితే తనకు ఫిర్యాదు చేయాలని మహిళలకు సూచించారు. ఇక నుంచి గ్రామాల్లో 9 గంటలకు షాపులు మూసేయాలని, రోడ్లపై ఎవరైనా కనిపిస్తే చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. డ్రగ్స్, గంజాయికి బానిసై యువత జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు.

ప్రణాళిక అమలు, నర్సరీల పెంపకంపై చర్యలు

నస్పూర్, అక్టోబర్ 2 : జిల్లాలో ప్రణాళిక విధానం అమలు, నర్సరీల పెంపకంపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి డీఆర్డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జడ్పీసీఈవో గణపతితో కలిసి హాజరయ్యారు. ఉపాధి హామీ పథకంలో 2024-25 సంవత్సరానికి గాను నిర్దేశించిన ప్రణాళికా విధానం అమలుతో పాటు నర్సరీల పెంపకంపై చర్యలు తీసుకోవాలని, ఈ క్రమంలో ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈసీలకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. అవసరమైన పనులను గుర్తించాలని, వాటిని నవంబర్ 30న గ్రామ, మండల స్థాయిలో ఆమోదంతో జిల్లా కార్యాలయానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, అంతర్గత రహదారుల మరమ్మతులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏమైనా మరమ్మత్తు పనులు ఉంటే పూర్తి వివరాలతో నివేదిక రూపొందించి అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

బెజ్జూర్, అక్టోబర్ 2 : కొలవార్ తెగలకు ఐటీడీఏ ద్వారా 100 శాతం రాయితీ రుణాలు మంజూరు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పార్వెల్లి పోశం కోరారు. ఆదివాసీ భవనంలో బుధవారం కొలవార్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ మండల కేంద్రంలో రూ.50 లక్షలతో కొలవార్ సంక్షేమ భవనం మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ నెర్పెల్లి సదాశివ్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నెర్పెల్లి బ్రహ్మయ్య, కార్యదర్శి తుమ్మిది అశోక్, ఉద్యోగ సంఘం కార్యదర్శి మానెపల్లి లక్ష్మణ్, కొలావార్ నాయకులు బిబ్బెర భూమయ్య, పెద్దల శంకర్, మహేశ్, సతీశ్ పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తవ్వకాలు

ప్రభుత్వ భూముల నుంచి రాత్రి సమయంలో తరలింపు

కుంటను కూల్చి తవ్విన మొరం

ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

భీమారం, అక్టోబర్ 2 : భీమారం మండలంలో మొరం అక్రమ తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నది. ప్రభుత్వ భూముల్లో అర్ధరాత్రి వేల జేసీబీ సాయంతో తవ్వుకుంటూ సొమ్ముచేసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ విప్ బాల్క సుమన్.. బృహత్, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానం, రైతు వేదిక, ప్రభుత్వ భవనాలు, దవాఖాన ఒకే చోట నిర్మించేందుకు సర్వే నంబర్ 138లో 53 ఎకరాల 7 గుంటల ప్రభుత్వ భూమిని అందుబాటులోకి తెచ్చారు. 15 ఏళ్ల క్రితం ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా పూడిక తీసి కుంట నిర్మించారు. కేసీఆర్ ప్రభుత్వం అక్రమార్కులు అటువైపు కన్నెత్తి చూడలేదు. కానీ, ఇప్పుడు దానిపై కన్నేసిన అక్రమార్కులు ఇదే అదునుగా భావించి, హస్తం లీడర్ల అండతో మొరం అమ్ముకుంటున్నారు. అర్ధరాత్రి 2 నుంచి ఉదయం 6 గంటల దాకా రవాణా చేస్తున్నారు. ఇటీవల అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే వివేక్.. మొరం, ఇసుక అక్రమ రవాణా, భూదందాలు చేస్తే సహించేది లేదన్నారు. అయినా హస్తం లీడర్లు అదే పనిగా అక్రమ దందాను ప్రోత్సహిస్తున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదని ఓ వర్గం కాంగ్రెస్ లీడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆ నిర్మాణం అక్రమమా.. సక్రమమా..!

బెల్లంపల్లి, అక్టోబర్ 2 : పట్టణంలోని కాల్‌టెక్స్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన రాంనగర్ అండర్ బ్రిడ్జి సమీపంలో రాత్రికి రాత్రే ఓ నిర్మాణం వెలిసింది. బెల్లంపల్లిలో బుధవారం చర్చనీయాంశంగా మారింది. 'ఇది ప్రభుత్వ భూమి ఆక్రమించినచో శిక్షార్హులు' అని రెవెన్యూ అధికారులు బోర్డు పాతగా, అదే స్థలంలో కోర్టు పరిధిలో ఉందని సదరు వ్యక్తులు మరో బోర్డు పాతడం సంచలనం రేపింది. ఆ స్థలంలో బతుకమ్మ ఆడుకునేందుకు అనుమతి ఇవ్వాలని 13వ వార్డుకు చెందిన నాయకులు ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. మరుసటి రోజే (మంగళవారం రాత్రికి రాత్రే) సిమెంట్ ఇటుకలు, రేకులతో గది ఏర్పాటు చేశారు. పైగా ఈ స్థలం హైకోర్టు పరిధిలో ఉన్నదని, నిర్మాణం అడ్డుకోవద్దని సదరు వ్యక్తులు బోర్డు ఏర్పాటు చేయడం ఆ దారిలో వెళ్లే వారికి ఆసక్తి రేపుతున్నది. ఆ గది గోడకు ఇంటి నంబర్ కూడా రాసి పెట్టడం చర్చనీయాంశంగా మారింది. రాత్రికి రాత్రే సంబంధిత అధికారులు ఇంటి నెంబర్ ఎలా ఇచ్చారనే



ఫ్లైఓవర్ పక్కన రాత్రికి రాత్రే వెలిసిన గది

సందిగ్ధత నెలకొన్నది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులును వివరణ కోరగా సదరు ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపట్టారని, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి, తుది నివేదిక అందిస్తే ఇంటి నంబర్‌ను ఆన్‌లైన్ నుంచి తొలగిస్తామని తెలిపారు. గతంలో సిబ్బందితో గుడ్ విల్‌తో ఇంటి నంబర్ తీసుకున్నాడని పేర్కొనడం గమనార్హం. తహసీల్దార్ జ్యోత్స్నను ఫోన్‌లో సంప్రదించగా, స్పందించలేదు. అదీ ప్రభుత్వ స్థలమా.., కోర్టు పరిధిలో ఉన్నదా.. అన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది.

పెట్రోల్ బంక్ ప్రారంభించాలి

సిర్పూర్(యు), అక్టోబర్ 2 : మండల కేంద్రంలో నిర్మించిన జీసీసీ పెట్రోల్ బంక్‌ను ప్రారంభించాలని వీటీడీఏ సంఘాల మండలాధ్యక్షుడు కుమ్రం భీంరావ్ కోరారు. ఈ మేరకు ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఐటీడీఏ పీవో కుష్బు గుప్తాకు వినతి పత్రం అందజేశారు. రెండేళ్ల క్రితమే నిర్మాణం పూర్తయినా అధికారులు ప్రారంభించడం లేదని తెలిపారు. ఈ మేరకు పీవో స్పందిస్తూ జీసీసీ మేనేజరును పిలిపించి, జాప్యానికి గల కారణాలు తెలుసుకున్నారు. సివిల్ సప్లై అధికారులు వద్ద ఆలస్యం అవుతుందని మేనేజర్ తెలుపడంతో వెంటనే ప్రారంభించాలని అధికారులకు పీవో ఆదేశాలు జారీ చేశారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

కౌటాల, అక్టోబర్ 2 : కౌటాల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు లైసెన్స్, ఆటోల ధ్రువీకరణ పత్రాలు, ఇన్సురెన్స్ తదితరాల గురించి సీఐ ముత్తె రమేశ్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. మహిళా ప్రయాణికులతో మర్యాదగా ఉండాలని సూచించారు. ఎస్ఐ మధూకర్, పోలీసులున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రెబ్బెన, అక్టోబర్ 2 : రెబ్బెన మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని లిఖిత ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఆమెను ప్రిన్సిపాల్‌తో పాటు, వైస్ ప్రిన్సిపాల్ రజిత, పీడీ రజిత, పీఈటీ స్వరూప, అధ్యాపకులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు..

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 2 : జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థులు నవీన్, నవ్య శ్రీ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సిస్టర్ లిబిన్ తెలిపారు. 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణ్‌పేట్ జిల్లాలో జరిగే అండర్-17 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనను న్నట్లు పేర్కొన్నారు. వారిని పీడీ కడతల రాకేశ్, పీఈటీలు కిరణ్, అర్చన కుమారి, బద్రీ అభినందించారు.

శిక్షణ తరగతులు వాయిదా వేయాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 2 : రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవుల్లో చేపట్టిన శిక్షణ తరగతులు వాయిదా వేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్ రావు, సంఘం ప్రతినిధులు యూఎన్ చారి, అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరు నెలల క్రితం నియమితులైన సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ లెక్చరర్, పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్, ట్రైనింగ్ గ్రాడ్యుయేట్ టీచర్స్, స్పెషల్ టీచర్స్, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్స్, వివిధ కేటగిరీల్లో నియమితులైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు హైదరాబాద్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనుండగా, బతుకమ్మ, దసరా నేపథ్యంలో వాయిదా వేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 2 : జిల్లా కేంద్రంలో బెల్లంపల్లి చౌరస్తాలో బుధవారం జరిగిన జరిగిన రోడ్డు ప్రమాదంలో జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన కొలిపాక రాజన్న (సుతారి మేస్త్రీ), నస్పూర్ మండలం సీతరాంపల్లికి చెందిన జాడి కవిత (కూలీ) గాయాలైనట్లు పట్టణ ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు. నూతన భవన నిర్మాణ పనులు చేసేందుకు కొలిపాక రాజన్న, జాడి కవిత బైక్‌పై ఏసీసీ వైపు వెళ్తున్నారు. బెల్లంపల్లి చౌరస్తా వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ వారిని వెనుక నుంచి ఢీకొట్టింది. రాజన్నకు తీవ్రగాయాలవగా, కవితకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకెళ్లారు. ప్రమాదానిక కారణమైన లారీని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసు దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జైపూర్, అక్టోబర్ 2 : జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం దొరగారిపల్లెలో బుధవారం పేకాటాడుతున్న ఇందారం గ్రామానికి చెందిన కామెర లలితప్రసాద్, గోదావరిఖనికి చెందిన మాతంగి ఓదెలు, ఆడెపు వెంకటేశం, దాసరి అశోక్, గోనె తిరుమలేశ్, నల్లమ శ్రీనివాస్, కొడిపెల రామకృష్ణను అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడిచేసి రూ. 7935 నగదుతో పాటు, 5 సెల్‌ఫోన్లు, ఆటో స్వాధీనం చేసుకున్నటుల చెప్పారు.

కోటపల్లి, అక్టోబర్ 2 : కోటపల్లి మండలం శంకరాపూర్ అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు, రూ.10,930, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు.

పద్మశాలీ సంఘం ఎన్నికల ఏర్పాట్లు

కాగజ్‌నగర్, అక్టోబర్ 2 : కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలీ సేవా సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని సంఘ భవనంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నికలకు 14 పోలింగ్ కేంద్రాలు, 14 బ్యాలెట్ బాక్సులు, అత్యవసర సమయంలో వినియోగించుకునేలా 4 అదనంగా బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అధికారులు నారాయణ, సమ్మయ్య బుధవారం తెలిపారు.

తాగుడుకు బానిసై ఒకరి మృతి

కాసిపేట, అక్టోబర్ 2 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్యాంక్ బస్తీకి చెందిన భూక్యా లాలు(43) తాగుడుకు బానిసై మృతి చెందాడని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. లాలు తన కుటుంబాన్ని వదలి స్థానికంగా కూలీ పని చేసుకుంటూ ఒక్కడే ఉంటున్నాడు. తాగుడుకు బానిసై, ఇంట్లోనే మృతి చెందగా పక్కవారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతిపై అనుమానం లేదని లాలు కొడుకు అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కొలవార్ మండల కమిటీ

కౌటాల, అక్టోబర్ 2 : ఆదివాసీ కొలవార్ (మన్నెవార్) మండల, యువజన కమిటీని బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య, జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఆత్రం సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బుర్స హనుమంతు, ఉపాధ్యక్షుడిగా నాయిని సిద్ధయ్య, పారిపెల్లి అశోక్, యువజన సంఘం మండలాధ్యక్షుడిగా పూజారి సుగుణాకర్, ప్రధాన కార్యదర్శిగా ధనూరి హన్మంతు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎర్గటి విజయ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆదివాసీ కొలవార్ సంఘం నాయకులు, ఆదివాసులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 2 : డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన బుధవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. డీఈవో యాదయ్యతో కలిసి వరంగల్ ఆర్జేడీ కే సత్యనారాయణ రెడ్డి సందర్శించారు. పరిశీలన తీరును సమీక్షించారు. మొదటి రోజు 45 మంది ఎస్జీటీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పూర్తయినట్లు ప్రకటించారు. 5 వరకు 1:3 నిష్పత్తిలో మెస్సేజ్‌లు వచ్చిన అభ్యర్థుల పరిశీలన జరుగుతుందని తెలిపారు.